# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

గురువారం,5 డిసెంబర్ 2024 | 8 పేజీలు


## సీలు వేశారు - గొళ్ళెం మరిచారు



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులు మూసివేయడంతో మద్యం ప్రియులు , బార్ల వద్ద గుమ్ము గూడారు, కొన్ని బార్లకు ప్రధాన గేట్లను సీలు వేసి ఎక్సైజ్ అధికారులు ప్రక్కనున్న కొన్ని గేట్లు వదిలివేయడంతో ఏదేచిగా మద్యం వ్యాపారం సాగించారు, ప్రత్యేకమైన దినాలలో సైతం రెండు రోజులు నియంత్రించలేని పరిస్థితులు నెలకొన్నాయి, అమాయకులు రెండు మూడు సీసాల అమ్మే వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. తప్పఏదేచిగా పెద్ద వ్యాపారం చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపిస్తున్నారు.

## నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు

# పూర్తయిన ఏర్పాట్లు

- ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- 2,667 మంది ఓటర్లు - 20 పోలింగ్ కేంద్రాలు





**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఉభయ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి తెలిపారు. బుధవారం స్థానిక తాహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ను కలెక్టర్‌పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాల్లో 2,667 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జిల్లాలో ఏలూరు అర్బన్ పోలింగ్ కేంద్రాలలో అత్యధికంగా 896 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా కుక్కునూరు మండలంలో ఆరుగురు తమ ఓటు హక్కు

- తరువాయి 2లో..

## నేడు జరిగే ఉపాధ్యాయ

# ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు
- ప.గో.జిల్లాలో మొత్తం ఓటర్లు 3,729.. పురుషులు 2,268, స్త్రీలు 1,461మంది



**భీమవరం,మేజర్‌న్యూస్:** ఈనెల 5వ తేదీ గురువారం నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరీ జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణా కోసం పోలింగ్ సిబ్బంది, మెటీరియల్ ఆర్డీవోల పర్యవేక్షణలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లడం జరిగిందన్నారు. ఉభయ గోదావరీ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చెయ్యడం జరిగిందన్నారు. డిసెంబరు 5 గురువారం బ్యాలెట్ పద్ధతిలో ఉదయం

- తరువాయి 2లో..

## గవరవరం ఉపాధి హామీ పనుల్లో నిధులు గోల్‌మాల్?

- పనులు చేయించకుండానే చేసినట్లు చూపి, నిధులు స్వాహా
- సోషల్ ఆడిట్‌లో ఫిర్యాదు చేయడానికి గ్రామస్థులు సన్నాహం



**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన పనులు చేయకుండానే లక్షలాది రూపాయల నిధులు బ్యాంకు నుంచి విత్ డ్రా చేసి, లక్షలాది రూపాయలు స్వాహాచేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తు తున్నాయి. ప్రస్తుతం సామాజిక తనిఖీలు జరుగు తున్న నేపథ్యంలో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమౌతున్నారు. కొయ్యలగూడెం మండలం గవరవరంలోని సీతారాముడి చెరువులో పూడికతీత పనులు చేయించ కుండానే, చేసినట్లు లెక్కలు చూపించి, మస్తర్లువేసి,సుమారు రూ. 3.50 లక్షలు స్వాహా చేసినట్లు ఆగ్రామానికి చెందిన కొందరుఆరోపిస్తున్నారు. ఈ విషయమై సామాజిక తనిఖీ గ్రామసభలో ఫిర్యాదు చేయాలని నిర్ణయించి నట్లు గ్రామస్తులు మేజర్‌న్యూస్‌కు తెలిపారు. ఆగ్రామానికి చెందిన

- తరువాయి 2లో..

## పెద్దోడైనా పేదోడైనా రేటు తగ్గేదేలే !

- మట్టి ట్రాక్టర్లు వేగానికి భయాందోళనలో ప్రజలు
- మైనర్లు, లైసెన్సులు లేని డ్రైవర్లు ట్రాక్టర్ల నడుపుతున్న పట్టించుకోని అధికారులు



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** తమకి అడ్డేఎవరు అనే రీతిలో మట్టిని తరలించే ట్రాక్టర్లు గ్రామాల్లోని రహదారులపై అతివేగంగా డిజె సౌండ్ సిస్టం అధిక సౌండ్‌తో మట్టి ట్రాక్టర్లు తిరగడంతో ఎక్కడ ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పెద్దోడైన, పేదవాడైనా రేటు తగ్గేదేలే అంటున్న మట్టి మాఫియా, ముడుపులు చెల్లించాకే బళ్ళు రోడ్డు మీదకు వస్తాయి మాకేంటి అంటూ దర్జాగా సమాధానం చెబుతారని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. జీలుగుమిల్లి మండలంలో రాచన్న గూడెం గ్రామంలో బుధవారం పట్టపగలు మట్టి తోలకాలు జోరుగా సాగించారు. మట్టి లోడుతో ఉన్న ట్రాక్టర్లు తిరిగే స్పీడుకు స్థానికులు బింబెలుతున్నట్లు పేర్కొంటున్నారు. గ్రామంలోని

- తరువాయి 2లో..

## దేశవ్యాప్తంగా అందుబాటులో

# 136 వందే భారత్ రైళ్లు ..

- ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**ఢిల్లీ/ఏలూరు,సూర్య బ్యూరో :** దేశ వ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్ల సేవలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ, సమాచారం, ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్ సభలో ప్రకటించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. వంద వందే భారత్ రైళ్ల టెండర్ ప్రక్రియ రద్దు వెనుక కారణాలేంటని, టెండర్లు రద్దు చేయడం వల్ల 'మేక్ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన దేశీయ రైలు పరిశ్రమ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందా? అనిఎంపీ ప్రశ్నించారు. టెండర్లు రద్దు చేయడం వల్ల కొత్తరైళ్ల సేకరణలో మరింతజాప్యం,అడ్డంకులు ఏర్పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని

- తరువాయి 2లో..

# నేడు జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

మొదటిపేజి తరువాయి

8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిన తదుపరి ఆయా పోలింగ్ సామాగ్రి భీమవరం జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన మధ్యంతర రీసీప్షన్ కేంద్రానికి తరలించి,అదే రోజు రాత్రి బ్యాలెట్ బాక్సు, ఇతర పత్రలు అత్యంత భద్రత మధ్య కాకినాడకు తరలిస్తామని తెలియ చేశారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 9వ తేదీన కాకినాడలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారిగా జిల్లా రెవిన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు, 26 మంది పీవోలు, 78 మంది ఏపీఓ లు, 26 మంది మైక్రో అబ్జర్వర్లు, 20మంది రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్స్‌గా ముగ్గురు ఆర్టీవోలు, ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 3,729 మంది కాగా పురుషులు 2,268 మంది,మహిళలు 1,461 మంది ఉన్నారన్నారు. మండలాలవారీగాఅత్తిలిలో 90 మంది, ఆకువీడులో 90 ,ఆచంటలో 63, భీమవరంలో 759,గణపవరంలో 66, ఇరగవరంలో 53, కాళ్ళ 52, మొగల్తూరు 88, నరసాపురం 425, పెంటపాడు 73, పోడూరు 71, పాలకోడేరు 102, పెనుమంత్ర 85, పెనుగొండ 156, పాలకొల్లు 480, తాడేపల్లిగూడెం 377, తణుకు 407, ఉండి 69, వీరవాసరం 129 యలమంచిలి 94 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ మెటీరియల్ తరలింపును, సిబ్బంది, ఇతర అనుబంధ విధులను ఆర్డీవోలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో అర్బన్ తహసిల్దార్లు, ఇంచార్జ్ ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, ఎన్నికల డ్యూటీలు, ఇతర అధికారులు పర్యవేక్షణ చెయ్యడం జరిగిందన్నారు.

**– 20 పోలింగ్ కేంద్రాల వివరాలు –** అత్తిలిలో ప్రజా పరిషత్ అప్పర్ ప్రైమరీ బాలుర పాఠశాల. ఆకివీడులో ఎస్ ఎస్ ఎన్ జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్. ఆచంటలో ఎం వి ఆర్ గవర్నమెంట్ హై స్కూల్. భీమవరం అర్బన్‌లో ఎస్‌సి హెచ్ బిఆర్‌ఎం హైస్కూల్. గణపవరంలో శ్రీ సి హెచ్‌బిఆర్ జెడ్‌పి బాయ్స్ హై స్కూల్. ఇరగవరంలో జిల్లా పరిషత్ హై స్కూల్.కాళ్లలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్. మొగల్తూరులో శ్రీ పెనుమత్స రంగరాజు జిల్లా పరిషత్ హై స్కూల్. నరసాపురంలో మున్సిపల్ అప్పర్ ప్రైమరీ బాలికల పాఠశాల. పెంటపాడులో గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ స్కూల్. పోడూరులో డి.ఎస్ రాజు జిల్లా పరిషత్ హై స్కూల్. పాలకోడేరులో జిల్లా పరిషత్ హై స్కూల్. పెనుమంత్రలో భవిత ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ రిసోర్స్ సెంటర్ పెనుగొండలో ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్. పాలకొల్లులో బి.వి.ఆర్.ఎం మున్సిపల్ హై స్కూల్ 28 వ వార్డు. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ హై స్కూల్. తణుకులో జాస్తి సీత మహాలక్ష్మి గర్ల్స్ హై స్కూల్. ఉండిలో జిల్లా పరిషత్ హై స్కూల్. వీరవాసరంలో ఎం ఆర్ కె జెడ్పి హైస్కూల్. యలమంచిలిలో మండల ప్రజా పరిషత్ ప్రైమరీ స్కూల్ లో నిర్యహిస్తునట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు.

## గవరవరం ఉపాధి హామీ పనుల్లో నిధులు గోల్‌మాల్?

మొదటిపేజి తరువాయి

సీతారాముడి చెరువులో గడిచిన మే నెలలో రెండు వారాల పాటు పూడిక తీయించినట్లు,రోజుకు సుమారు100 మంది కూలీలలతో ఈ పనులు జరిగినట్లు ఉపాధి హామీ పథకం ఉద్యోగులు మస్తర్లు వేసి, లెక్కలు చూపుతున్నారని వారు ఆరోపించారు. అసలు ఆ చెరువులో పూడికతీత పనులు ఏమీజరగలేదని,పనులు జర్గగకుండానే దొంగ మస్తర్లు వేసుకున్నారని ఆరోపిస్తున్నారు. గవరవరం గ్రామానికి సీతారాముడి చెరువు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉంటుందని, ఆగ్రామానికి చెందిన కూలీలను కాకుండా,సమీపంలో ఉన్నచొప్ప రామన్నగూడెం గ్రామ (పంచాయతీ)కి చెందిన కూలీలను తీసుకువచ్చి, పనులు చేయించినట్లుగా మస్తర్లు వేశారు.పనులు జరిగినట్లుగా చెబుతున్న చెరువుకు చొప్పరామన్నగూడెం నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది. చెరువు ఉన్న గ్రామంలోని కూలీలను కాకుండా, వేరే పంచాయతీకి చెందిన కూలీలతో పనులు చేసినట్లు లెక్కలు రాస్తే, గుట్టు బయటపడదని సిబ్బంది భావించినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు 100 మంది వంతున రెండు వారాలు పని చేయించినట్లుగా చూపి, దాదాపు మూడున్నర లక్షల రూపాయల నిధులు కింది నుంచిపై స్థాయివరకూ ఉద్యోగులు దోచుకున్నారని వారు ఆరోపించారు. కాగా, గవరవరంలో ఎస్. ఆర్. ఆర్. శ్రీరంగరాజు పొలం వద్ద నుంచి పొంగుటూరు కామయ్యకుంట చెరువు వరకూ రోడ్డు నిర్మించినట్లు లెక్కలు చూపి, నిధులు డ్రా చేసారని, అలాగే పొంగుటూరులో గేలం వారి పొలం నుంచి కామయ్యకుంట వరకూ రోడ్డు వేసినట్లుగా కూడా లెక్కలు చూపి నిధులు డ్రా చేసారని ఆరోపించారు. ఈ పనులకు రూ.73వేలు ఖర్చు చేసినట్లుగా చూపి, మస్తర్లువేసి డబ్బుకూలీలకు చెల్లించి నట్లుగా లెక్కలు చూపారని ఆరోపించారు. ఈ రెండు పుంత రోడ్లు అసలు జరగలేదని వారు ఆరోపించారు. ఈ విషయమై సామాజిక తనిఖీ గ్రామసభల్లో ఫిర్యాదు చేస్తామని అక్కడ కూడా న్యాయం జరగకపోతే మండల స్థాయిలో జరిగే సామాజిక తనిఖీ సమావేశంలో ఫిర్యాదు అందజేస్తామని గ్రామస్థులు చెప్పారు.



## సీసీ రోడ్లు పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్

**పెనుగొండ,మేజర్‌న్యూస్:** పెనుగొండ గ్రామ పరిధిలో పలు వీధులులో 3.55 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆచంట నియోజకవర్గ ఎమ్మెల్యే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ తనయుడు పితాని వెంకట్ పర్యవేక్షించారు. పర్యవేక్షణలో భాగంగా మేక వారి వీధి కోడిపందాల దిబ్బ, కొప్పి శెట్టి వారి వీధి ,నాగుల చెరువు, రాజు గూడెం,మంగిన వారి వీధి ,దొంగ గూడెం తదితర సీసీ రోడ్లను పర్యవేక్షించారు.కాంట్రాక్టర్లకు అధికారులకు సరైన నాణ్యత ప్రమాణాలుపాటిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, త్వరిత గతిన రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చెయ్యాలని సూచించారు. కాంట్రాక్టర్లకు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు , ఈ కార్యక్రమంలో పెనుగొండ సర్పంచ్ నక్క శ్యామల సోనీ శాస్త్రి, తెలుగుదేశం కార్యకర్తలు ఎన్డీఏ కూటమి సభ్యులు, వార్డ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

### కనుల పండుగగా 'ఘంటసాల' జయంతి



**నూజివీడు,మేజర్‌న్యూస్:** ప్రముఖ సంగీత విధ్వంసులు, గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి బుధవారం సాయంత్రం నూజివీడులో కనులపండుగగా జరిగింది. స్థానిక శ్రీ సత్యనృత్యసంగీతకళాశాల ప్రాంగణంలో ఘంటసాల జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ విబిఎస్‌ఆర్ మోహన్ రావు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ దుర్గాంబ, మానవతా ట్రస్ట్ ప్రతినిధి పి కృష్ణ ప్రసాద్ తదితరులు ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల వెంకటేశ్వరరావు మనమధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ ప్రతి దేవాలయంలో ఆయన పాడిన పాటలు నిత్యం మనకు వినిపిస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. అనంతరం ఘంటసాల వెంకటేశ్వరరావుకు సంబంధించిన పాటలపై సంగీత విభావరి నిర్వహించారు. పలువురు ఆలపించిన గీతాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ పౌరాణిక శిఖామని అవార్డు గ్రహీత మల్లాది శ్రీనివాస నాగేశ్వర శర్మ, గాయకులు గుంటూరు కృష్ణ, స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ సభ్యులు టీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అవగాహన కల్పించిన అభయ రక్షక మహిళ దళం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా ఎస్పీ ఆదేశాలపై మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా ఎస్సై కాంతిప్రియ జిల్లాలో ఉన్న అభయరక్షక మహిళాదళం బుధవారం గస్తీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీ నిర్వహణ మహిళలపై ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా గస్తీపై దృష్టి.గస్తీ చేపట్టిన ప్రదేశాలు స్కూల్ లు కాలేజీ లు, పార్కు వద్ద పబ్లిక్ ప్రదేశాలు, బస్టాండ్లు రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలు. ఆర్టీసీ బస్సులలో,కాలేజీ బస్సులలో ప్రయాణం చేస్తున్న విద్యార్థిని విద్యార్థులకు పలు జాగ్రత్తలను తెలిపారు.ఆకతాయిలు మహిళలపై వేధింపులకు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు. అభయ రక్షక మహిళా దళం ప్రత్యేక బాధ్యతలు:మహిళల,బాలిక రక్షణ కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన అభయ రక్షక దళం సిబ్బంది అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యక్ష పర్యవేక్షణ.మహిళలకు రక్షణకల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలు:ఏదైనా ప్రమాద సూచికలు గమనించిన వెంటనే డయల్ 112 సర్వీస్ ద్వారా: పది నిమిషాల్లో బాధితులకు సత్వర రక్షణ.ప్రత్యేక దళం బాధితుల దగ్గరకు చేరుకుంటుందని వివరించారు.

## నేడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పూర్తయిన ఏర్పాట్లు

మొదటిపేజి తరువాయి

వినియోగించుకోనున్నారు.ఈ ఎన్నికల నిర్వహణకు 144 మంది పోలింగ్ సిబ్బందిని నియమించడం జరిగిందని, వారిలో 24 మంది పీవో,24 మంది ఒపిఓ ,24 మంది ఓపిఓ-2,మరో 24 మంది ఓపిఓ-3 కాగా నియమించడం జరిగిందన్నారు.మరో 24 మంది మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ నిర్వహణకు 24 మందిని నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించామన్నారు.ఏలూరు డివిజన్ పరిధిలో 10పోలింగ్ కేంద్రాలకు మూడు జోనల్ అధికారులను, మూడు రూట్లను ముగ్గురు రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. అదేవిధంగా జంగారెడ్డిగూడెం డివిజన్‌కి సంబంధించి పది పోలింగ్ కేంద్రాలకు ముగ్గురు జోనల్ అధికారులు,మూడు రూట్లు మూడు రూటు ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణకు 61 పెద్ద బ్యాలెట్ బాక్సులతోపాటు మరో ఆరు రిజర్వుగా ఉంచడం జరిగిందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఇప్పటికే యంసిసి అమల్లో ఉందన్నారు. 15 ఎస్‌ఎస్‌టి బృందాలు ,మరో 20ఎఫ్‌ఎస్‌టి బృందాలు పనిచేస్తున్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144సెక్షన్ అమలులో ఉందన్నారు. పోలింగ్ నిర్వహణ తీరును పరిశీలించేందుకు కలెక్టరేట్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కలెక్టరేట్లో 1950 తో కూడిన కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని,ఎన్నికల నిర్వహణకుసంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే తెలియ చేయవచ్చు అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి,సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబారిష్ తదితరులు ఉన్నారు.

## పెద్దోడైనా పేదోడైనా రేటు తగ్గేదేలే !

మొదటిపేజి తరువాయి

పలు బేస్మెంట్లలోకి, ఇంటి పరిసరాలలోకి జెసిబి, ట్రాక్టర్ల సహాయంతోఊరుబయట మట్టిని తరలించి అమ్ముకుంటున్నారు. మట్టిని తరలించేందుకు సుమారు 15 ట్రాక్టర్లును ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్క ట్రక్కు సుమారు 800 నుంచి రూ.1000 వరకు అమ్ముతూ ఒక రోజులోనే సుమారు 300 ట్రక్కులను మట్టిని ఊరు బయట నుంచి గ్రామంలోకి తరలించి లక్షలు జేబులో పెట్టుకుంటున్నట్లు వాపోతున్నారు. జెసిబి మట్టి తవ్వే చోట సుమారు పది అడుగుల మేర గోతులను ఏర్పాటు చేస్తున్నారు. వారు తవ్విన చోట పక్కనున్న పొలాలకు తీరని నష్టం వాటిల్లడమే కాకుండా వర్షాకాలంలో ఆగోతుల వలనప్రమాదాలు సంభవిస్తున్నాయని నీళ్లతో నిండితే పశువులు దాన్లో పడుతున్నాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. మట్టి మాఫియా చెప్పే మాటలు నిజమేనేమో అందుకే ఒక్క అధికారి కూడా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లకు లైసెన్సులు లేకపోయినా అడిగే వారే లేరని ఉన్నతాధికారులు మట్టి మాఫియా పై దృష్టి సారించి వారిని నియంత్రించాలని కోరుతున్నారు. మట్టితోలకంపై వీఆర్వో జగదీశ్వరిని వివరణ కోరగా తమకు తెలియకుండా బేస్మెంట్ లోకి మట్టిని తోలినట్లు తెలిపారు.

## దేశవ్యాప్తంగా అందుబాటులో 136 వందే భారత్ రైళ్లు ..

మొదటిపేజి తరువాయి

ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రయాణీకులకు మెరుగైన ప్రయాణం అనుభవాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో భారతీయ రైల్వే తొలిసారిగా దేశీయంగా తయారు చేసిన సెమీ-హై స్పీడ్ వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు.

ఆధునిక కోచ్‌లు, అధునాతన భద్రతా లక్షణాలు, ప్రయాణీకులసౌకర్యాలతో 2024 నవంబర్ 21నాటికి భారతీయ రైల్వేల బ్రాడ్ గేజ్ (బి.జి.) ఎలక్ట్రిఫైడ్ నెట్‌వర్క్‌లో 136 వందే భారత్ రైలు సేవలు అందుబాటులో ఉన్నాయని, వందే భారత్ చైర్ కార్ రేక్‌ల తయారీ పురోగతిలో ఉందని బదులిచ్చారు. అంతేకాకుండా దీర్ఘ,మధ్యస్థ అంతర్-రాష్ట్ర ప్రయాణాలకు వందే భారత్ స్లీపర్ రైళ్లను కూడా ప్రవేశ పెడుతున్నామని, ప్రస్తుతం 10 వందే భారత్ స్లీపర్ రైళ్లు తయారీలో ఉన్నాయని, భారతీయ రైల్వేలు 50 వందే భారత్ స్లీపర్ స్లీపర్ రేక్‌ల ఉత్పత్తికి కూడా ఏర్పాటు చేసిందని, అదనంగా 200 వందే భారత్ స్లీపర్ రేక్‌ల తయారీకి సంబంధించిన కాంట్రాక్టులు కూడా టెక్నాలజీ పార్టనర్స్‌కు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

## ఘనంగా ప్రపంచ మరుగుదొడ్లదినోత్సవం




**కుక్కునూర్,మేజర్ న్యూస్:** ప్రపంచం మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కుక్కునూర్‌లో మరుగుదొడ్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మరుగుదొడ్డిని ఉపయోగించుకోవాలని గ్రామాల్లో ప్రజలకు మరుగుదొడ్లపై మంచి అవగాహన కల్పించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఇ వీరస్వామి యం ఆర్‌సి రమేష్, పంచాయతీ కార్యదర్శి భూదేవి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## అందరితో సమానంగా అన్ని రంగాలలో దివ్యాంగులను ఆదరించాలి



**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** దివ్యాంగులను అందరితో సమానంగా అన్ని రంగాల్లో పురోభివృద్ధిని సాధించేలా చేయూతనివ్వాలని ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ బిక్షాలు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపితే వారి భవిష్యత్తును ఉన్నత స్థితిలో తీర్చిదిద్దవచ్చన్నారు. నడవలేని పిల్లలకు సర్పంచ్ ట్రైసైకిల్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ స్కూల్ బిళ్ళపాడు రిటైర్డ్ ఉపాధ్యాయులు సాయిబాబు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలు , ఫిజియోథెరపీ, గృహంలో చేపట్టే వ్యాయామాలు,పలు విషయాలు వివరించారు. జడ్పీ స్కూల్ హెచ్ఎం విజయ్ కుమార్ , సీఆర్పీలు,ఐఈఆర్పి డబ్ల్యు మోహనఫణికుమారి,బి నీలిమ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు సజావుగా నిర్వహించాలి : జెసి



**పోడూరు మేజర్ న్యూస్:** జిల్లా పరిషత్తు హైస్కూల్ ను జిల్లా జాయింటు కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగు స్టేషన్ కు సంబంధించి ఏర్పాట్లును పరిశీలించి, దిశానిర్దేశం చేశారు. రేపు నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పాటించి పాటించి వివాదాలకు తావివ్వరాదని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట ఆర్డీవో దాసిరాజు, తహశీల్దారు యస్.యం.ఫాజీల్, మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ, రెవిన్యూ సిబ్బంది,రైతు సేవా కేంద్రం సిబ్బంది,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్ధాల వాహనం స్వాధీనం : కేసు నమోదు



**పెదపాడు,మేజర్న్యూస్:** జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ నూజివీడు డిఎస్పీ కెవివిఎన్‌వి ప్రసాద్ ఆదేశాలపై చికెన్ వ్యర్థాలను రవాణా చేసే వారి పై ఉక్కు పాదం మోపిన పెదవేగి ఇన్స్పెక్టర్ వేంకటేశ్వర రావు ఈ నెల 2న చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోనికి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావుకి బుధవారం రాబడిన సమాచారం మేరకు వారి సిబ్బందితో కలిసి పెదపాడు మండలంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎపి 39 యువి 7997 నెంబర్ గల ట్రక్కులో చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు సరఫరా చేస్తున్నటు వంటి వాహనంను అదుపులోనికి తీసుకుని డ్రైవర్,యజమానీ,చేపల చెరువుల యజమానులపై చర్యలు తీసుకున్నారు. వాహన యజమానులు, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను ధ్వంసం చేసినట్టు ఇన్స్పెక్టర్ తెలియ చేశారు. ప్రజల ఆరోగ్యానికి వాతావరణ కాలుష్యానికి కారణం అవుతున్న చికెన్ వ్యర్థాల రవాణాను చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తున్న వారి సమాచారాన్ని డయల్ 112కు గాని పెదపాడు ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796636కు సమాచారాన్ని అందించాలని సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

## ఘనముగా షష్టి ఉత్సవాలు ప్రారంభం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయానికి ఉపవాలయమైన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో షష్టి ఉత్సవములు వైభవముగా జరుగునున్నాయి. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై బుధవారం ఉదయం స్వామివారిని పెండ్లి కుమారుని గాను అమ్మవార్లను పెండ్లి కుమార్తెగాను చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

వేద పండితులు, ఆలయ అర్చకులు రాము విశేష పూజలు నిర్వహించారు.ఈ క్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో బాబురావు పాల్గొని పూజలు నిర్వహించుకున్నారు.

## నిత్యాన్నదాన్ని ట్రస్టుకు రూ.1లక్ష 50వేలు విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్ కు భీమడోలు గ్రామానికి చెందిన సలాది వీర వెంకట సత్యనారాయణ, సాలాది రేవతి పేరున రూ.1లక్ష 1వేయి 116లు, అలాగే సలాది రామయ్య, వీర రాఘవ, పేర్లు నా రూ50వేల558లు విరాళాన్ని ఆలయ ఆఫీసు వద్ద సిబ్బందికి అందజేశారు. దాతకు ఆలయ ఏఈఓ నటరాజ్ పథకాల బాండ్లను స్వామివారి ప్రసాదాలను అందజేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి అభినందనలు తెలిపారు.

## వెన్నెల కోట శ్రీనివాస్‌కి ఘన నివాళి



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక గోకుల్ కళ్యాణ్ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన శ్రీనివాస్ పెద్దకర్మ సందర్భంగా వాళ్ల బావ ఆర్.ఎస్ బాబు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనిషికి సాయపడితే ప్రతి ఒక్కరూ దేవుడుతో కొలుస్తారని పేర్కొన్నారు.ఏలూరు పుర ప్రముఖులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వెన్నెల కోట శ్రీనివాస్ లాగా సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జంపా సూర్యనారాయణ, సగిరెడ్డి చిరంజీవి, దావాల రంగా, ఫ్లాష్ టీం సభ్యులు మల్లపు రెడ్డి మోహన్, జనపరెడ్డి నాగలక్ష్మి నారా యణ, సోషల్ సర్వీస్ గొంతిన.రామకృష్ణ, జనపరెడ్డి. శ్రీనివాస రావు, అల్లంపల్లి.రోషి ,తుంపాల. సత్యనారాయణ, పోతల. శ్రీని వాస్, కొత్తకోట చంద్ర మౌళి, జనపరెడ్డి దుర్గేష్, విధ పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొని వెన్నెలకోట హేమలత, ఉష,దివ్య, సాయిలను ఓదార్చి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. శ్రీనివాస్ చేసిన సేవలను గురించి కొనియాడారు.


## బహిరంగ పకటన

కాకినాడ జిల్లా, కాకినాడ సిటీ కాపురస్తులు, నా క్లయింట్ శ్రీ పీసుపాటి శేతు మాధవరావు గారు ఇచ్చిన సంజాయిషీ మేరకు, శ్రీ కొండపల్లి కేశుబాబు, శ్రీమతి కొండవల్లి రామలక్ష్మి గార్లతోపాటు యెల్ల జనులకు తెలియజేయునది ఏమనగా..

1998 డిసెంబర్‌లో వినాయక చిట్‌ఫండ్స్ (ఫర్మ్ రిజిస్ట్రేషన్ నెం. 245 ఆఫ్ 1998) పేరుతో ది. 21.12.1998 తేదీన 1) పీసుపాటి శేతు మాధవరావు 2) ప్రత్తి నారాయణ రావు 3) పీసుపాటి అప్పల వీర వెంకట సత్యనారాయణ మరియు 4) కొండపల్లి కేశుబాబు గార్లు పార్టనర్స్‌గా పార్టనర్‌షిప్ అగ్రిమెంటు వ్రాసుకుని ప్రారంభించి యున్నారు. వీరందరూ కలసి శ్రీ వినాయక చిట్‌ఫండ్స్, కాకినాడలోను మరియు జంగారెడ్డిగూడెంలోను ప్రారంభించినారు. జంగారెడ్డిగూడెం బ్రాంచి వ్యవహారం అంతా అనగా డబ్బులు వసూలు మరియు పేమెంట్స్ అన్ని శ్రీ కేశుబాబు గారు వారి భార్య శ్రీమతి రామలక్ష్మిగారు చూసుకొనేవారు. తర్వాత, 2012 సం.రం. లో వినాయక చిట్‌ఫండ్స్‌ని లిమిటెడ్ కంపెనీగా మార్చినారు. లిమిటెడ్ కంపెనీలో కూడా ది. 07.08.2012 నుండి 16.10.2023 వరకు శ్రీమతి కొండపల్లి రామలక్ష్మి గారు డైరెక్టరుగా ఉన్నారు. ఆవిడ తరుపున ఆమె భర్త అయిన శ్రీ కొండపల్లి కేశుబాబు గారు కంపెనీ వ్యవహారాలు చూసుకొనేవారు, మొదటి నుంచి కూడా జంగారెడ్డిగూడెం బ్రాంచికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్ని శ్రీ కొండపల్లి కేశుబాబు గారు, వారి భార్య శ్రీమతి రామలక్ష్మి గారు చూసుకొనే వారు. ఈరోజు వరకూ కూడా జంగారెడ్డిగూడెం బ్రాంచికి సంబంధించిన లెక్కలు ఏమీ తేల్చకుండా సొమ్ము సుమారు 8 కోట్లు రూపాయలు పైన వారి వద్ద వుంచుకున్నారు. స్నేహితుడనే నమ్మకముతో, అభిమానంతో శ్రీ పీసుపాటి శేతు మాధవరావుగారు ఈరోజు వరకు వారిని తన వాటా సొమ్మును ఇమ్మని అడగలేదు. జంగారెడ్డిగూడెం బ్రాంచికి కావలసిన మొత్తం మెటీరియల్ ఇన్ని సంవత్సరాలు కూడా శ్రీ పీసుపాటి శేతు మాధవరావుగారు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వారికి యిచ్చినారు. అంతే కాకుండా కాకినాడ బ్రాంచి నుంచి సొమ్మును కూడా శ్రీ కొండపల్లి కేశుబాబు గారు తీసుకుని, లాభాలు వస్తాయని జంగారెడ్డిగూడెం తన ఫ్యాక్టరీలో ఇన్వెస్ట్ చేసుకున్నారు. మరియు జంగారెడ్డిగూడెం బ్రాంచిలో వచ్చిన లాభాలతో శ్రీ కేశుబాబు గారు వారి కుటుంబ సభ్యుల పేరు మీద చాలా ఆస్తులు కొన్నారు. శ్రీ పీసుపాటి శేతు మాధవరావుగారికి తెలియకుండా సమకూర్చుకున్నారు. ఏవిధమైన ఆస్తి లేని వ్యక్తి శ్రీ పీసుపాటి శేతు మాధవరావు గారిని మోసం చేసి ఈరోజు కోట్లుకు పడగెత్తారు. శ్రీ పీసుపాటి శేతు మాధవరావుగారిని మోసం చేసిన సొమ్ముతో జంగారెడ్డిగూడెంలో అంజని ఆగ్రోటెక్ అనే ఫ్యాక్టరీ ప్రారంభించినారు. ఇది యిలాఉండగా, కోవిడ్ సమయంలో మొత్తం చిట్‌ఫండ్స్ వ్యాపారము ఆగిపోవడం వలన కంపెనీ ఆర్థిక పరిస్థితి దెబ్బతిని కంపెనీ నష్టాలలోకి వచ్చింది. ఈ సమయంలో శ్రీ శేతు మాధవరావు గారు, శ్రీ కొండపల్లి కేశుబాబు గారిని, వారి భార్య రామలక్ష్మి గారిని గత 26 సం.రం.లు నుండి జంగారెడ్డిగూడెం బ్రాంచి నుండి తనకు రావలసిన లాభాల వాటా యివ్వమని అడిగినారు. వారు ఒక పైసా కూడా ఇవ్వం, మీ ఇష్టం వచ్చినట్లు చేసుకో అని అన్నారు. అంతే కాకుండా మాధవరావు గారిని ఐ.పి. పెట్టమని వత్తిడి చేసినారు. దానికి మాధవరావు గారు అంగీకరించలేదు. తన శక్తి కొలది చందాదారులు ఎవ్వరిని మోసం చేయకుండా డబ్బులు తిరిగి యివ్వడానికి ప్రయత్నిస్తున్నారు. చాలా వరకూ చందాదారుల సొమ్ము చెల్లించారు. పార్టనర్స్ మోసం చేయుట వలన శేతు మాధవరావుగారు ఆర్థిక ఇబ్బందులలో పడ్డారు. ఈరోజుకు కూడా చందాదారులకు డబ్బులు తిరిగి చెల్లించడానికి ప్రయత్నిస్తున్నారు. వారికి ఎవరినీ మోసం చేసే ఉద్దేశ్యం లేదు. శ్రీ కేశుబాబు గారు చేసిన నమ్మక ద్రోహానికి నా క్లయింటు శ్రీ పీసుపాటి శేతు మాధవరావుగారు బలయ్యారు.

శ్రీ కొండపల్లి కేశుబాబు గారికి, వారి భార్య శ్రీమతి కొండపల్లి రామలక్ష్మిగారికి తెలియజేయునది ఏమనగా ఈ నోటీసు ప్రచురణ అయిన వారం రోజులలో మీరు జంగారెడ్డిగూడెం బ్రాంచిలో గత 26 సం.రం.లు నుండి జరిపిన వ్యాపార లావాదేవీల అకౌంట్సు అన్ని నా క్లయింటు శ్రీ శేతు మాధవరావు గారితో తేల్చుకోవలెను. ఆయనకు మీరు ఇవ్వవలసిన రూ.8 కోట్లు అందజేయగలరు. లేని యెడల నా క్లయింటు శ్రీ శేతు మాధవరావు గారు మీపై తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

(కె.వి.ఎన్.ఎన్. మూర్తి)
అడ్వకేట్, హైకోర్టు, ఆంధ్రప్రదేశ్
జి.ఎఫ్-3, మాలతి నివాస్ అపార్ట్మెంట్స్,
ఉండవిల్లి, అమరావతి రోడ్డు, గుంటూరు జిల్లా, ఏ.పి.
సెల్: 99493 94515

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోనే ముడిపడి ఉన్న ఇంజనీరింగ్ ప్రగతి







**భీమవరం,మేజర్‌న్యూస్:** ఇంజనీరింగ్‌లో ఏబ్రాంచ్ అయినా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో అనుసంధానంతోనే ఇన్నోవేషన్స్‌లో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని మలేషియాలోని యూనివర్సిటీ పుత్ర కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఫ్యాకల్టీ డాక్టర్ జురీనా మోహద్‌హనాపిపేర్కొన్నారు. స్థానిక ఎస్ ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అల్గరిథమ్స్ ఇన్ అడ్వాన్స్డ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఐసిఏఏఏఐ -2024) పేరిట 3 రోజులపాటు జరుగుతున్నఅంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి అధ్యక్షులుగా సిఎస్సి హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు, డీన్ ఎకడమిక్ డాక్టర్ వి చంద్రశేఖర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా మలేషియా శాస్త్రవేత్త డాక్టర్ జరీనా మోహద్ అనాపి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విప్లవాత్మక మార్పులు తీసుకు రావటమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలకు మార్గదర్శకంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. మరో అతిథి జేఎన్టీయూకే కాకినాడ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ ఎస్ ఎస్ ఎన్ ఉషాదేవి మాట్లాడుతూ ఎన్నో వినూత్న అంశాలకు జవాబు పొందవచ్చునని ఆమె పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు మాట్లాడుతూ తను సివిల్ ఇంజనీర్ అయినప్పటికీ అనేక నూతన అంశాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అధ్యయనం చేయగలుగుతున్నామని పేర్కొన్నారు.కళాశాలప్రిన్సిపల్ డాక్టర్‌కె.వి మురళీకృష్ణంరాజు, సిఎస్సి హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు,డీన్ అకాడమిక్స్ డాక్టర్ విచంద్రశేఖర్,కళాశాల సెక్రటరీఅండ్‌కరస్పాండెంట్ సాగిరామ కృష్ణ నిషాంత్ వర్మ, ఐఐటి హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం వి పాండురంగారావు,కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు ,న్వీనర్ డాక్టర్ ఆర్‌ఎన్‌వి జగన్మోహన్,కో కన్వీనర్ తంగిరాల వెంకట పూర్ణ ప్రసాద్, అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ప్రచురించిన సావనీరును మలేషియా శాస్త్రవేత్త జురీనా మోహద్ అనాపి విడుదల చేశారు. సదస్సులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పరిశోధకులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆర్‌బికెల ద్వారా నచ్చిన రైసు మిల్లులకు ధాన్యాన్ని పంపాలి

**- మధ్యవర్తులకు అమ్ముకోవద్దు : జెసి**



**పోడూరు,మేజర్‌న్యూస్ :** మండలంలో పండితవిల్లూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు.అనంతరం రైసు మిల్లు తనిఖీ చేసి, రిజిస్టర్లను కంప్యూటరు డేటాను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకుని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. మధ్య దళారుల మోసపూరిత మాటలు నమ్మి తక్కువ ధరకు దాన్యం అమ్ముకొని మోసపోవద్దని రైతులకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా రైతులను మభ్యపెట్టి మధ్యవర్తులు అక్రమంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ప్రస్తుతం 17 శాతం తేమ ఉన్నదాన్ని కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. రైతులకు ఏ సమయంలోనైనా ఏ విధమైన సహకారం కావాలన్నా జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని జిల్లా జాయింటు కలెక్టరు భరోసా ఇచ్చారు

# తేమ శాతం పేరుతో ధాన్యం మద్దతు ధరలో కోత అన్యాయం



**- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శ**

**పెదవేగి,మేజర్ న్యూస్ :** తేమ శాతం పేరుతో ధాన్యం మద్దతు ధరలో కోత పెట్టి రైతులకు, కౌలు రైతులకు అన్యాయం చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెదవేగి మండలంలోని వంగూరు, లక్ష్మీపురం గ్రామాలలో పర్యటించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కల్లాలోని ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమస్యలను రైతులను, కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం లెక్కింపులో జరుగుతున్న మోసాలు పట్ల నిరసన వ్యక్తం చేశారు. వంగూరు రైతు సేవా కేంద్రంలో తేమ శాతం లెక్కింపును రైతు సంఘం నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో లెక్కించిన తేమ శాతానికి భిన్నంగా రైస్ మిల్లుల్లో అధిక తేమ శాతం చూపి అన్నదాతలను ఇబ్బందులు గురి చేయడం తగదని అన్నారు. వంగూరులోని జోజి అనే కౌలు రైతుకు ఆరబెట్టిన ధాన్యానికి రైతు సేవా కేంద్రంలో 17.2శాతం తేమశాతం రాగా పెదవేగి రైస్ మిల్లులో 20శాతంగా చూపుతున్నారని చెప్పారు.

మరో రైతు ధాన్యానికి రైతు సేవా కేంద్రంలో 15.5శాతం తేమ రాగా రైస్ మిల్లులో 21శాతంగా చూపుతున్నారని వివరించారు. తేమ శాతం లెక్కింపులో జరుగుతున్నమోసాలు వల్ల అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి.జోజి, ఎం.అబ్రహం, కె.సీతారామయ్య, జి.నాగేశ్వరరావు, ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన నేషనల్ అచీవ్మెంట్ సర్వే



**భీమడోలు,మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భీమడోలు మండల పరిధిలోని విద్యార్థుల స్థాయిని పరిశీలించేందుకు బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్మెంట్ సర్వే(పరాక్ రాష్ట్రీయ సర్వేషణ్-2024) కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని మండల విద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండల స్థాయిలో అంచనాలను నిర్ణయించేందుకు మండల పరిధిలోని ఒక ప్రాథమికోన్నత, ఒక ప్రైవేటు, నాలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మూడు ,ఆరు,ఎనిమిదవ తరగతులకు చెందిన విద్యార్థులకు మూడు సబ్జెక్టుల్లో నిర్వహించిన పరీక్షలకు 144 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. దీనితోపాటు పాఠశాలలో గల సౌకర్యాలను పరిశీలించేందుకు ఉపాధ్యాయుల ద్వారా ఇదే రూపంలో సమాచారం సేకరించినట్లు చెప్పారు. గుండుగొలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాశం పాండురంగారావు, సిఆర్‌ఎంటి రమణతో పాటు మరొక ఆరుగురు స్వచ్ఛంద కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారని విద్యాధికారి తెలిపారు.

## వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్,డిఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆదేశాలపై ట్రాఫిక్ నియమ నిబంధనలు గురించి ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ టౌన్‌లో వాహన దారులు తప్పకుండ హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకుండ ద్విచక్ర వాహనం డ్రైవ్ చేసినట్లు అయితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోబడునని, మద్యం సేవించి వాహనములు నడుపరాదని మద్యం సేవించి వాహనములు నడిపిన వారిపై ఎఫ్‌ఐఆర్ (ప్రధమ సమాచార నివేదిక ) నమోదు చేయుబడునని తెలిపారు. మైనర్‌లకు వాహనములు ఇచ్చినచో వారీ తల్లి దండ్రులు పై తగు చర్యలు తీసుకుంటమని,వాహనమును సీజ్ చేస్తామని సిఐ తెలిపారు. మైనర్ డ్రైవింగ్, వాహనాలకు సైలెన్సర్‌లను మార్చి శబ్ద కాలుష్యం చేసే వారి పై , రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవింగ్ చేసే వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయబడుతుందని,సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనములు నడుప రాదని, అతివేగంగా వాహనములు నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, వాహనములు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా అలా చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఏలూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ,ఆర్.ఎస్.ఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

## బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు -10 మద్యం సీసాల స్వాధీనం



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ బుధవారం డ్రైడే సందర్భంగా నిర్వహించిన దాడులలో పాలకొల్లులో పి.శ్రీనివాసు అను వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్దనుండి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు,దాడులలో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియ చేశారు.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసన







**– ఏలూరులో భారీ ర్యాలీ,ఫైర్ స్టేషన్ సెంటర్లో మానవహారం**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను యావత్‌సమాజం ముక్తకంఠంతో ఖండించాలని,వారికి అండగా నిలవాలని హిందూ జాగృత సమితి ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది రమణమూర్తి కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, స్వామీజీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ బుధవారం ఏలూరులో హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. మొదట పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పెద్ద ఎత్తున వచ్చిన వ్యాపారులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వామీజీలు ర్యాలీగా బయలుదేరి బంగ్లాదేశ్‌లోని హిందువులపైన జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫైర్ స్టేషన్ సెంటర్‌కు చేరుకొని మానవహారం నిర్వహించారు. అనంతరం తిరిగిర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డిఆర్‌ఓ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హిందూ జాగృత సమితి ప్రతినిధి రమణమూర్తి మాట్లాడుతూ బంగ్లాదేశ్ ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేసిన ఇస్కాన్ స్వామి చిన్మయ్ కృష్ణదాస్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ లోని మైనార్టీలకు యావత్ భారతదేశం అండగా నిలుస్తుంది అన్నారు. అర్చక సమైక్య రాష్ట్రఅధ్యక్షులు అగ్నిహోత్రం ఆత్రేయ బాబు మాట్లాడుతూ హిందువుల రక్షణకు అంతర్జాతీయ సమాజం కూడా బంగ్లాదేశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగారపాటి సీతారామాంజనేయ చౌదరి, విజయవాడ జోన్ ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ప్రముఖ వ్యాపారవేత్త లునాని, కృష్ణ నందగిరి స్వామి, కరుణానందగిరి స్వామి, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, హిందూ జాగృతి సమితి కన్వీనర్ మేడిశెట్టి పాములు, కో కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి,పార్టీలకతీతంగా వివిధ పార్టీల నాయకులు, పలు హిందూ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 6 నుండి రెవెన్యూ గ్రామ సదస్సులు : తహశీల్దార్ రాజరాజేశ్వరి



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈనెల 6 నుండి 26 వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తాసిల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తేదీన మండలంలోని గొంది గ్రామంలో ఉదయం 9 గంటలకు గ్రామ సచివాలయం దగ్గర సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. 26వ తేదీ రుస్తుంబాద గ్రామంలో గ్రామ సదస్సుతో ముగుస్తాయన్నారు. అపరిష్కృతంగా ఉన్న భూమి సమస్యలు, పంట భూములను వారసులకు బదిలీ చేయటం,తదితర భూములకు సంబంధించిన సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని తాసిల్దార్ తెలిపారు. సంబంధిత పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని, వాటిపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులకు భూములను బదిలీ చేయటం జరుగు తుందన్నారు.

తాసిల్దార్‌తో పాటు మండల సర్వేయర్, ఆర్ ఐ, వీఆర్వో తదితరులతో కూడిన కమిటీ ఈ సదస్సుకు హాజరై సమస్యలపై వినతి పత్రాలు తీసుకుంటుందని తాసిల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. భూముల సమస్యల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈసదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ రామరాజుకి ఘన నివాళి





**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** ఛాంబర్స్ విద్యా సంస్థలు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్,ప్రముఖ ఆడిటర్ కలిదిండి రామరాజుకి కళాశాల ప్రాంగణంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, రామ రాజు చిత్ర పటానికి పూల మాల చేసి నివాళులు అర్పించారు,కలిదిండి రామరాజు అనారోగ్య కారణంగా స్వర్గస్తులవ్వడం బాధాకరం అని ఛాంబర్స్ కళాశాల అభివృద్ధిలో ఎంతో కృషి చేసినారని అటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో మంచి సంబంధాలను ఏర్పరచుకుంటూ,విద్యా ప్రణాళికలను కాలానికి అనుగుణంగా అమలుపరచుటట్లు చేయడం విద్యార్థులకు వెన్నుదన్నుగా ఉన్నారని చైర్మన్ కె.వి.ఆర్ నరసింహారావు అన్నారు

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.వేంకటేశ్వర రావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో దశ దిశను నిర్దేశిస్తూ మధ్యతరగతి దిగు మధ్య తరగతి విద్యార్థులు తమ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉద్యోగాల కల్పనలో కృషిచేసినారని, అందరితో స్నేహం గాను మంచి పలకరింపు ఆత్మీయతతో ఉండేవారని అన్నారు

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.వోల్గా మాట్లాడుతూ రామరాజు ఆయన ఒక మంచి మానవతావాది అని స్నేహశీలి అని విద్యార్థులతో చక్కని అనుబంధాన్ని కలిగి విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తారని అన్నారు.

తదుపరి యాజమాన్య సభ్యులు అడిషనల్ చైర్మన్ తటవర్తి కృష్ణమూర్తి,ట్రెజరర్ ప్రవీణ్ భాను యాజమాన్య సభ్యులు అడబాల రమణ ,వినుకొండ రంగారావు జయప్రకాష్ నూలు భాస్కర్ కంచర్ల వీర్రాజు దేవరపు లక్ష్మీనారాయణ, రంగనాథరాజు విశ్వనాథరాజు ఛాంబర్స్ కార్యదర్శి సీతారామ రాజు, ఎకడమిక్ అడ్వైజర్స్ ఏబిఎస్ మూర్తి నందుల సీతారామ్ అధ్యాపకులు అధ్యాపకేతర,విద్యార్థిని విద్యార్థులు తమతో రామరాజు అనుబంధాలని సభాముఖంగా వ్యక్తం చేశారు.

## ప్రేమ సంతోష సమాధానాలతో నింపేదే క్రిస్మస్

**– బ్రదర్ వి.విజయకుమార్ ,ఎంఎం కిషోర్**





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** ప్రేమ , సంతోష సమాధానాలతో నింపేదే క్రిస్మస్ సందేశమని బ్రదర్ వి.విజయకుమార్ ,ఎం.ఎం కిషోర్ పేర్కొన్నారు. ముదినేపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో లెమెన్స్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరణ భయముచేత దాస్యమునకు లోనైనా వారిని పాపము నుండి శాపము నుండి విడిపించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనని ఆయన యందు విశ్వసించి నిత్యజీవం సంపాదించు కోవాలన్నారు. సి.ఎస్.ఐ పారిష్ పాస్టర్ తిమోతి,మీడియా పాత్రికేయులతో కలసి క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ గీతాలు అందరిని అలరింపచేశాయి. ఈ కార్యక్రమంలో విమోహన్ రావు,దుర్గారావు,మీడియా ప్రతినిధులు సిహెచ్ నాగరాజు , జి చంద్రశేఖర్ ,బి శివరాజ్ ,ఎన్ శివ, పి నందేశ్వరరావు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘంటసాలకు ఘన నివాళులు



**పాలకొల్లు ,మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ కళాక్షేత్రం ప్రాంగణంలో స్థానిక ఘంటసాల సంగీత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఘంటసాల 102వ జయంతి నిర్వహించారు, ఈ కార్యక్రమంలో బి. నరసింహమూర్తి' వివిఎస్ఎన్ మూర్తి, కె ఎస్ వి డి ప్రసాద్ , ఘంటసాల ఆలపించిన భక్తి పాటలు శ్లోకాలు ఆలపించారు, కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు కొల్లి నరసింహమూర్తి ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు, ఘంటసాల భగవద్గీత గాయకులు బి.నరసింహమూర్తి ని జ్ఞాపిక అందజేసి ఎస్ ఎన్ ఆర్ట్స్ వారు సత్కరించారు, ఈ కార్యక్రమంలో ఏబీఎన్ గోపి,రవి ,వంగ నరసింహమూర్తి తిరుపతి రాజు, పాల్గొని ఘంటసాల గురించి కొనియాడారు,

## 5 నుండి 7 వరకు వ్యవసాయ విద్యుత్ రెండు విడతలుగా సరఫరా

**పెదవేగి,మేజర్ న్యూస్:** భీమడోలు – పెదవేగి 232 కెవి ఫీడర్ ప్రస్తుతము వున్న కండక్టర్ మార్పు చేయుట కారణంగా 5వ తేదీ నుండి 7 వరకు వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేయబడునని ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్, కెయం.అంబేద్కర్ తెలిపారు. కనుక 132/33కెవి విద్యుత్ ఉపకేంద్రము, పెదవేగి పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రములకు చెందిన వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు అందరు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## రోడ్ల నిర్మాణాల నాణ్యత పరిశీలించిన కలెక్టర్

**– నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశం**



**పెదవేగి,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కె.వెట్రిసెల్వి బుధవారం పెదవేగి మండలం ముం దూరు గ్రామంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలుబుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించా ల్సిందేనని స్పష్టం చేశారు. ఆయా పనులకు సంబంధించి వివరాలను అధికారులు కలెక్టర్ వారికి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం నాణ్యతలో ఎక్కడ రాజీపడరాదని అధికారులకు సూచిం చారు. నిర్దేశించిన గడువులోగా చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బి ఎస్‌సి జాన్ మోషే, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలు పెంచి భారం వేసిన కూటమి ప్రభుత్వం



**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్** :విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై కూటమి ప్రభుత్వం భారం అవుతుందని సిపిఐ ఎమ్ ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు ధర్మల సురేష్ విమర్శించారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరు మీద యూనిట్‌కి 92 పైసలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బుట్టాయగూడెం తాసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు.పి వై ఎల్ జిల్లా నాయకులు తగరం బాబురావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కమిటి సభ్యులు ధర్మల సురేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసహరించాలని డిమాండ్ చేసారు.గత ఎన్నికల ముందు కూటమిలో ఉన్న పార్టీలు తెలుగుదేశం జనసేన బిజెపి అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో యూనిట్ కి 92 పైసలు కరెంటు చార్జీలు పెంచారని మండిపడ్డారు. వెంటనే ట్రూ ఆఫ్ పేరున పెంచిన విద్యుత్ రేట్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కారంరాఘవ,ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి రమణ ఉపాధ్యక్షులు సరియం రామ్మోహన్ పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఈభూషణం పిఓడబ్ల్యు జిల్లా నాయకులు కే.రామలక్ష్మి తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమానికి పిడిఎస్‌యు నాయకులు బన్నె వినోద్ పివైఎల్ కెచ్చేల పోతిరెడ్డి ఏఐకేఎంఎస్ నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు గురుగుంట్ల గంగిరెడ్డి నడిపిరాజు కే.ప్రతాప్‌దాడి మారయ్య పాయం ముకరాజు ఉకే వీర్రాజు కట్టం శంకరయ్య తదితరులున్నారు.

# వైభవోపేతంగా శ్రీ సంతాన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట



**కైకలూరు,మేజర్ న్యూస్**, స్థానిక శ్రీ సంతాన నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఎంతో వైభవపీతంగా జరిగింది. కైకలూరు స్వాంప్ డ్రెయిన్ కాలువ గట్టుపై వెలసిన శ్రీ స్వామివారి ఆలయ పునర్నిర్మాణ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమైన విషయం విధితమే. దీనిలో భాగంగా బుధవారం శ్రీ గణపతి, శ్రీ నాగబంధ, శ్రీ మయూర వాహన సహిత శ్రీ సంతాన నాగేంద్ర, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పుల్లేటికుర్తి భోగేశ్వర శర్మ శిష్య బృందం గణపతి శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా నిర్వహించిన వివిధ హోమాల పూర్ణాహుతి అనంతరం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దివ్య శాంతి కల్యాణం జరుగగా అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వాహకులు చావలి శంకర్ శాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టారు. పరిసర గ్రామాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎం శివకిరణ్, న్యాయవాదులు గురజాడ ఉదయ శంకర్, వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, పి పవన్ కాంత్,శ్రీ రామలింగేశ్వర స్వామి ధర్మకర్త ఉప్పులూరి ముత్తం రాజు శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పంద్రంగి కనకదుర్గ ప్రసాద్,పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# 8 వరకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సు శిక్షణకు దరాఖస్తులు

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాలను అభివృద్ధిచేసి మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలో స్కిల్ హబ్ ద్వారా ప్రభుత్వ ఐ.టీ.ఐ కళాశాల, సత్రంపాడు నందు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుకు గానూ స్వల్పకాలిక శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించినట్లు గవర్నమెంట్ ఐ.టీ.ఐ ప్రిన్సిపాల్ పి. రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అర్హత,ఆసక్తి వున్న అభ్యర్థులు నుండి ఈనెల8వ తేదీ వరకు అప్లికేషన్స్ స్వీకరించ బడతాయన్నారు.శిక్షణ అనంతరం ఉపాధి కల్పించేందుకు కొన్ని పరిశ్రమల యాజమాన్యాలతో ఐ.టీ.ఐ కాలేజి ఒప్పందం చేసుకోవటం జరిగిందన్నారు. 10వ తరగతి,ఆపైన చదువుకున్న ఖాళీగా వున్న అభ్యర్థులు అర్హులు. వయసు 30 సంవత్సరాలు లోపు వుండాలన్నారు. 10వ తరగతి సర్టిఫికెట్,ఆధార్ కార్డు నకలుతో రిజిస్ట్రేషన్ చేయబడునన్నారు. ఇతర వివరాలకు – 8978524022 సంప్రదించవలసిందిగా కోరారు.

# సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలలో పీడియాట్రిక్ డెంటిస్ట్ డే వేడుకలు






**పెదవేగి,మేజర్ న్యూస్:** దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీలో మంగళవారం పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రి విభాగం వారు (ఇండియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ) ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ వీక్‌ఉత్సవాన్ని పురస్కరించుకొని, ఫ్ట 2024 నవంబర్ 19 నుండినవంబర్ 25 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమాలను ప్రొఫెసర్, హెచ్.ఓ.డీ డాక్టర్ అరోన్ అరుణ్ కుమార్, పీడియాట్రిక్స్ విభాగం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 450 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పిల్లలకు మౌఖిక శుభ్రత విధానాలు, దంతాల బ్రషింగ్, చేతుల పరిశుభ్రత, ప్రాథమిక దంతాలు ,సామాన్య ఆరోగ్యం గురించి ఆరోగ్య విద్యను వివిధ విజువల్,ఆడియో సహాయకులతో అందించారు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచే ఉద్దేశ్యంతో క్విజ్ పోటీలు, క్రాస్ మ్యాచ్, వ ఫైండింగ్, మెమరైజింగ్ గేమ్స్, మంచి ఆహారం,చెడు ఆహారాన్ని గుర్తించడం (చిత్రప్రతినిధి) వంటి పోటీలు నిర్వహించబడ్డాయి. పిల్లలలో ప్రతిభను బయటపెట్టే విధంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి. పిల్లలలో మౌఖిక ఆరోగ్యంపై ఆసక్తిని పెంచేఉద్దేశ్యంతో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ద్వారా ఒక ఆలోచన ప్రేరణాత్మక రోల్‌ప్లే ప్రదర్శించబడింది. ఈకార్యక్రమంలో హైలైట్గా పిల్లల ఫ్యాషన్ వాక్ జరిగింది. జాతీయ పీడియాట్రిక్ డెంటిస్ట్‌డే సందర్భంగా చిల్డ్రన్స్ వీక్ విజయవంతంగా పూర్తి చేసిన పట్ల సెక్రెటరీ,కార్పొరేట్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ మోజెస్ ,ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ స్లీవా రాజు సిబ్బంది, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అభినందించారు.

# స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌ను కలసిన నరసాపురం నాయకులు



**విజయవాడ/నర్సాపురం,మేజర్‌న్యూస్:**స్పోర్ట్స్అథారిటీ రాష్ట్రచైర్మన్ అనిమిని రవినాయుడుని మర్యాదపూర్వకంగా విజయవాడలోని ఆయన కార్యాలయంలో నరసాపురంకు చెందిన స్పోర్ట్స్ నిర్వాహకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.బుధవారం జరిగినఈ కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు మెమోరియల్ క్రీడా సంఘం స్పోర్ట్స్ సొసైటీ రాష్ట్రం ఇంచార్జి చైర్మన్, చెన్నంశెట్టి చక్రపాణి, రాష్ట్ర కరస్పాండెంట్ తిరుమలశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర వైస్ చైర్మన్ దేవిరెడ్డి ధర్మారావు ,రాష్ట్రం గౌరవాధ్యక్షులు కొండవీటి నాగబాబు రాష్ట్ర ఈసి సభ్యుడు నిస్సంకరావు ప్రకాష్ ఆరేటి మృత్యుంజయరావు,పులపర్తి సురేష్, ఇంటి ప్రభాకర్ తదితరులు పాల్గొని నరసాపురంలో స్పోర్ట్స్ అభివృద్ధి కోసం, క్రీడాకారులనుప్రోత్సహించేందుకు సహకారం అందించ వలసిందిగా కోరారు.

# 6న కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఈనెల 6వ తేదీన ఏలూరు 1 వ పట్టణం పరిధిలో గల కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిదిలో విద్యుత్ లైన్ల దగ్గరగా గల చెట్ల కొమ్మల తొలగింపు,విద్యుత్ లైన్ల వార్షిక మరమత్తుల నిమిత్తం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేయబడునని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఏం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయములో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో గల కోటదిబ్బ,మెయిన్ బజార్,పాండురంగ థియేటర్,అగ్రహారం, మార్కెట్, కెనాల్ రోడ్, సత్య నారాయణ పేట,లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, భావిశెట్టి వారిపేట నల్ల దిబ్బ పరిసర ప్రాంతాలలో పరిసరప్రాంతాలలో విద్యుత్‌సరఫరా నిలిపివేయ బడును కావున వినియోగదారులు సహకరించ వలసినదిగా ఆయన కోరారు.

## ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఆయిల్ ప్యాకెట్‌లు కొనాలి



**పెనుగొండ,మేజర్‌న్యూస్:** ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఆయిల్ ప్యాకెట్‌లను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారంజిల్లా జాయింట్ కలెక్టర్ పెనుగొండ మండలం పెనుగొండలో ఆయిల్ అమ్మకం స్పెషల్ కౌంటర్ ను,రీ సర్వేపై గ్రామసభలో వచ్చిన ఫిర్యాదులు, వెంకట సుబ్రహ్మణ్యం రైస్ మిల్లు, రైతు సేవా కేంద్రంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత స్పెషల్ ఆయిల్ కౌంటర్ ను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుచున్న ఆయిల్ ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పామాయిల్ రూ.110 లకు అమ్మకాలు చేసేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కౌంటర్ నందు అమ్మకాలు తక్కువగా జరగడం గుర్తించిన జెసి విస్తృతప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రజలు స్పెషల్ ఆయిల్ కౌంటర్ నందు అమ్ముచున్న పామ్ ఆయిల్ ప్యాకెట్లను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై గ్రామ సభలో వచ్చిన పిటిషన్లను పరిశీలించారు. అనంతరం పెనుగొండలోని వెంకట సుబ్బయ్య రైస్ మిల్లును సందర్శించి అన్లోడ్‌అవుతున్నధాన్యాన్ని పరిశీలించారు. ట్రక్ షీట్ వెంటనే క్లీయర్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంలో పెనుగొండ తహసిల్దార్ జి.అనిత కుమారి, మండల వ్యవసాయ అధికారి స్పందన, తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్




ఏలూరు,మేజర్ న్యూస్ : ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో నిబంధలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలింగ్ అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.
ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో నిబంధనలను మేరకు వుండవలసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈపోలింగ్ కేంద్రంలో 896 మంది హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోని, బుధవారం రాత్రి పోలింగ్ కేంద్రం వద్దే ఉండాలన్నారు. బ్యా లెట్ బాక్స్ లకు ఏజెంట్ల సమక్షంలో సీల్ వేసి పోలింగ్ నిర్వహణకు సిద్ధం కావాలన్నారు .గురువారం ఉదయం8గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుతా అంబారి ష్,ఏలూరు తాహసిల్దార్ వి.శేషగిరి తదితరులు ఉన్నారు.

**-జిల్లా వ్యాప్తంగా 20 పోలింగ్ కేంద్రాలు**

-కుక్కునూరు మండలంలో జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ బిల్డింగ్, వేలేరుపాడులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ,జీలుగుమిల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్, బుట్టాయగూడెంలో హైస్కూల్, పోలవరంలో ప్రభుత్వజూనియర్ కళాశాల, కొయ్యలగూడెంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల,జంగారెడ్డిగూడెంలో జెడ్పీ బాలికల హైస్కూల్, టి.నరసాపురంలో ఎంపీపీ స్కూల్, కామవరపుకోటలో జెడ్పీ హైస్కూల్,ద్వారకాతిరుమలలో ఎంపీ అప్పర్ ప్రైమరీ స్కూల్, చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్,లింగపాలెంలో జిల్లాపరిషత్‌హైస్కూల్, ఉంగుటూరులో జిల్లా పరిషత్ హైస్కూల్, భీమడోలులో ఎంపీపీ స్కూల్, పెదవేగిలో జిల్లా పరిషత్ హైస్కూల్, పెదపాడులో జిల్లా పరిషత్ హైస్కూల్, ఏలూరు అర్బన్ లో కోతదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల,ఏలూరు రూరల్‌లో శ్రీమాగంటి అంజనేయ సత్యవతి జిల్లా పరిషత్‌హైస్కూల్ (చాటపర్రు), దెందులూరులో గారపాటి హైమావతి జిల్లా పరిషత్ హైస్కూల్, నిడమర్రులో ఏజీకే జిల్లా పరిషత్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**- పోలింగ్ కేంద్రాల వారి ఓటర్ల వివరాలు**

-కుక్కునూరు మండలం 6 ,వేలేరుపాడు మండలం 11,జీలుగుమిల్లి మండలం 70 ,బుట్టాయిగూడెం మండలం 339 ,పోలవరం మండలం 103 ,కొయ్యలగూడెం మండలం 113, జంగారెడ్డిగూడెం 273, టీ నర్సాపురం 35 ,కామవరపుకోట 55, ద్వారక తిరుమల 69 , చింతలపూడి మండలం 232, లింగపాలెం 48 ,ఉంగుటూరు 69, భీమడోలు 91 ,పెదవేగి 65, పెదపాడు 72, ఏలూరు అర్బన్ 896 ,ఏలూరు రూరల్ 16,దెందులూరు 77 ,నిడమర్రు 27, మొత్తం 2667.

## నియోజకవర్గ కాపు జేఏసీ అధ్యక్షునిగా ఆకేన నరేష్ నాయుడు



నరసాపురం,మేజర్‌న్యూస్ : మండల కాపు జేఏసీ యువజన విభాగం అధ్యక్షునిగా ఆకన నరేష్ నాయుడు నియమితులయ్యారు.
బుధవారం జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ దేవి రెడ్డి ధర్మారావు నియమించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు పులపర్తి సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇంటిప్రభాకర్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ కంబాల స్వర్ణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాడి సంధ్యారాణి, నియోజకవర్గ లీగల్ కన్వీనర్ గునిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఏలూరు,మేజర్‌న్యూస్: ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఆర్ఆర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా వినతులు స్వీకరించిన ఆయన వారికి ధైర్యం చెప్పారు. నేనున్నానంటూ భరోసా కల్పించారు.ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రజలిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు కృషిచేస్తున్నానన్నారు.అలాగే ప్రజలుకూడా తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

# కొత్త పట్టిసీమలో పశువైద్యశాల నూతన భవనం

**- పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు మంత్రి ఆదేశం**

**- ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తికి స్పందించిన అచ్చెన్నాయుడు**

ఏలూరు,మేజర్‌న్యూస్ : పోలవరం మండలం కొత్తపట్టిసీమలో పశు వైద్యశాల నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ను ఆదేశించారు. కొత్తపట్టిసీమలో 1977లో స్థాపించిన పశువైద్యశాల ద్వారా ఆరు పంచాయతీల పరిధిలోని 5వేల పశువులకు చికిత్స అందిస్తున్నారని, గతంలో నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఇటీవల మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించే క్రమంలో పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా వెటర్నరీ ఆసుపత్రికి నూతన భవనం మంజూరు చేయాలని పోలవరం ప్రాంత ప్రజల తరఫున ఎంపీ మంత్రిని అభ్యర్థించారు. ఎంపీ మహేష్ కుమార్ వినతికి సానుకూలంగా



స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు ఈ మేరకు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తన విన్నపానికి తక్షణం స్పందించి ఆదేశాలు జారీ చేసిన మంత్రికి ఎంపి కృతజ్ఞతలు తెలిపారు.

## రైసు మిల్లర్లు ధాన్యాన్ని త్వరితగతిన అన్లోడు చేసుకోవాలి : జెసి



పాలకొల్లు,మేజర్‌న్యూస్: పాలకొల్లు మండలం పూలపల్లి రంగరాజు రైసు మిల్లును బుధవారం జిల్లా జాయింటు కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. రైసుమిల్లు రిజిస్టర్లు, కంప్యూటరు డేటాను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యమును వెంటనే అన్లోడ్ చేసేవిధంగా మిల్లర్లు సహకరించాలన్నారు. అవసరాన్ని బట్టి హమాలీలను అందుబాటులో ఉంచుకుని వాహనములు అన్లోడ్ చేయించిన వెంటనే పంపివేయాలని కస్టోడియన్ అధికారులనుఆదేశించారు. ఆరబెట్టిన ధాన్యములను మిల్లులకు తరలించేందుకు అధికారులుఅన్నిచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తగినన్ని గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని అన్నారు. దళారులను నమ్మి ధాన్యం విక్రయించవద్దని రైతులకు సూచనలు ఇచ్చారు. రైతు సేవా కేంద్రాల్లో మద్దతు ధరతో ధాన్యాన్ని విక్రయించుకోవాలని జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి కోరారు. జిల్లా జాయింటు కలెక్టరు వెంట మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరి టిడిపి కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరణ



మంగళగిరి/ఏలూరు,మేజర్‌న్యూస్: గుంటూరు జిల్లా మంగళగిరి లోని కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండిబుధవారం వీరు ఫిర్యాదులు స్వీకరించారు.

## రోడ్డు పనులలో ఎక్కడా రాజీ పడవద్దు : జిల్లా కలెక్టర్



దెందులూరు,మేజర్ న్యూస్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిని పూర్తి చేయాలని సంబం ధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. బుధవారం దెందు లూరు మండలం శ్రీరామ వరం రోడ్డు నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి నాణ్యత,పొడవు, వెడల్పు, అంచనా ఖర్చు వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామవరం గ్రామానికి చెందిన కామిరెడ్డి సోము బ్రహ్మం కలిసి కలెక్టర్ రోడ్ల నిర్మాణ పనులపై ఆరా తీశారు. పల్లంగా ఉన్నందున కొంత మేరకు సిసి రోడ్లు పది రోజుల్లో పూర్తి చేస్తారని తెలిపారు. ఈ గ్రామం నుంచి తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డు రిపేరు పనులు కొనసాగిస్తున్నామని ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ మోషే కలెక్టర్ కు వివరించారు. రోడ్డుకు డ్రైనేజీ ఏర్పాట్లకు కొంతమేరకు స్థలాన్ని వదులుతున్నారు లేదా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గతంలో రోడ్డు పరిస్థితి రోడ్డు రిపేర్ చేసిన తర్వాత ఉన్న పరిస్థితికి సంబంధించిన ఫోటోలను అందజేయాలని చెప్పారు.